

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755






అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభ వేడుకకు హాజరైన ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్న తిరుపతి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ - సభలో చిత్తూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి - మంత్రులతో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు - సభాస్థలి వద్ద ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్యేలు సునీల్‌కుమార్, విజయశ్రీ ,సోమిరెడ్డి చంద్రమోహన రెడ్డి, పులివర్తి నాని, కురుగొండ్ల రామకృష్ణ, మురళీమోహన్, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, మాజీ మంత్రి పరసా రత్నం తదితరులు

ఆర్థిక సాధికారత దిశగా
కుప్పం మహిళ!

- డిజిటల్ లిటరసీతో సామర్థ్యం విస్తరణ
- ఫ్రాంటియర్ మార్కెట్స్, కడా ఒప్పందంతో సాకారం



ఎస్ఎస్‌లుగా ఎంపిక చేసిన 25 మంది గ్రామీణ మహిళలు

కుప్పం, మే 2 (ఆంధ్రజ్యోతి):కుప్పం గ్రామీణ మహిళను సంప్రదాయబద్ధమైన పాడి, వ్యవసాయం, కుటీర స్థాయి వ్యాపారాలనుంచి బయట పడేసి వారికి విస్తారమైన ప్రపంచాన్ని పరిచయం చేయడానికి ప్రయత్నాలు ప్రారంభయ్యాయి.ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే ప్రవచించే డిజిటల్ లిటరసీ ద్వారా వారి సామర్థ్యాన్ని పెంచి ఆర్థిక సాధికారత సాధించడానికి అడుగులు పడుతున్నాయి. ఫ్రాంటియర్ మార్కెట్స్‌తో కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడా) కుదుర్చుకున్న ఒప్పందం దీనికి శ్రీకారం చుట్టింది.

కడా, ఫ్రాంటియర్ మార్కెట్స్ భాగస్వామ్యంతో గత నెల 30వ తేదీన కుప్పం మండల సచివాలయంలో ఒక ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కుప్పంలో 25 మంది మహిళలను ఎంపికచేసి వారికి ప్రత్యేకమైన కిట్స్ అందజేశారు. ఈ సందర్భంగా పీడీ వికాస్ మర్మత్, ఫ్రాంటియర్ మార్కెట్స్ వ్యవస్థాపకురాలు, సీఈవో అయిన అజైతా షా మాట్లాడిన మాటలు అదే సమావేశంలో ఉన్న చాలామందికి అర్థమైనట్లు అనిపించలేదు. కానీ రాష్ట్రంలో సాంకేతిక యుగం తీసుకు రావాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్య సాధన దిశగా ఈ రెండు సంస్థల భాగస్వామ్యంతో ముందడుగు పడిందన్నది నిజం. వెలుగు ప్రాజెక్ట్ ద్వారా ప్రభుత్వం ఇప్పటికే గ్రామీణ మహిళల్లో ఆర్థిక సాధికారతను పెంపొందించే దిశగా బలమైన పునాదులు నిర్మించింది. అయితే ఆ పునాదులు గ్రామీణ మహిళల పొదుపు ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకు వెళ్లి, సంప్రదాయబద్ధమైన వ్యాపారాలు, లేదా వ్యవసాయ, పాడి సంబంధమైన యూనిట్లు స్థాపించుకుని ఆర్థికంగా ఎదగడానికి మాత్రమే దోహదం చేస్తున్నది. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం నియోజకవర్గ మహిళల విషయంలో ఇంతకుమించి ఆలోచించారు. అందుకనే ఈజీ మార్ట్, అలీప్ వంటి సంస్థల్ని తీసుకొచ్చారు. ఆయా సంస్థల కార్యకలాపాలు డిజిటల్ లిటరసీతో ముడిపడి ఉన్నాయి. కుప్పం గ్రామీణ మహిళకు గ్రామీణ స్థాయి సామర్థ్యాలు పుష్కలంగా ఉన్నాయి కానీ, ఆధునిక సాంకేతికతను వినియోగించుకునే నైపుణ్యం ఇంకా నేర్వాల్సి ఉంది. ఈ లోటును కడా, ఫ్రాంటియర్ మార్కెట్స్‌తో కుదుర్చుకున్న ఒప్పందం భర్తీ చేస్తుంది.

ప్రాజెక్ట్ ముఖ్యాంశాలు...

ప్రతిష్ఠాత్మకమైన రెండు సంస్థల మధ్య కుదిరిన ఒప్పందం ద్వారా సాకారమయ్యే ప్రాజెక్ట్ సహకార పద్ధతిలో రూపొందించిన ప్రణాళిక, స్థానిక అమలు పద్ధతులపై ఆధారపడి ఉంటుంది. కుప్పం నియోజకవర్గంలోని గ్రామీణ మహిళల్లో ఆర్థిక సాధికారత పెంపొందించే దిశగా డిజిటల్ లిటరసీని ప్రోత్సహించడం ప్రధాన లక్ష్యం. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు ఉపయోగించడం ద్వారా ప్రతి స్త్రీకి స్థిరమైన జీవనోపాధిని నిర్మించడంతో పాటు ఆమె సామర్థ్యం సమాజానికి అర్థవంతంగా ఉపయోగపడడానికి అవసరమైన వనరులు, మద్దతు ఇవ్వడం కూడా. టిస్‌లో శిక్షణ పొందిన ప్రోగ్రాం మేనేజరు ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో పని చేసేందుకు ఇప్పటికే 25 మంది సూపర్ సహేలీ (ఎస్ఎస్), 11 మంది మహిళా వ్యవస్థాపకులను తయారు చేశారు. ఈ రెండు కేటగిరీలు కూడా గ్రామీణ మహిళలే కావడం విశేషం. వీరికి ప్రత్యేకమైన శిక్షణ ఇస్తున్నారు. మెరి సహేలీ యాప్, ఫ్రాంటియర్ మార్కెట్స్ గ్రామీణ వాణిజ్య ప్లాట్‌ఫామ్ ద్వారా డిజిటల్ వ్యవస్థాపకులుగా మారేందుకు అవసరమైన పరికరాలు, శిక్షణ ఇస్తున్నారు.తద్వారా గ్రామీణ స్థాయిలో వాణిజ్యం ప్రారంభించడానికి వీలవుతుంది. అగ్రికల్చర్, వినియోగరంగం తదితర కామర్స్ ట్రాన్సాక్షన్లు యాప్ ద్వారా ప్రారంభిస్తారు. మొబైల్ అంటే ఇప్పుడు అరచేతిలో ఇమిడిపోయిన ప్రపంచం. దీన్ని వినియోగించుకోవడం నేర్చుకోవాలి. అంటే కేవలం కాల్ మాట్లాడడం, వీడియో చేయడం, చాటింగ్ చేయడం వంటివి మాత్రమే కాదు. మొబైల్ ద్వారా అందుబాటులోకి వచ్చిన అపరిమితమైన వ్యాపార సంబంధమైన యాప్‌లు, ప్లాట్‌ఫామ్‌లు వినియోగించడమెలాగో తెలియాలి. తద్వారా ఆర్థిక సాధికారత సాధించాలి. పదిమందికీ సాధించేలా శిక్షణ ఇవ్వగలగాలి. ఇది జరిగేందుకు అవసరమైన డిజిటల్ లిటరసీని ఈ ప్రాజెక్ట్ ప్రాథమిక దశనుంచీ నేర్పిస్తుంది. అందుకు తగిన శిక్షణ ఇవ్వడం ద్వారా గ్రామీణ వాణిజ్య సామ్రాజ్యాన్ని నిర్మించి ఇక్కడి మహిళకు ఆర్థిక సాధికారత సాధించి చూపెడుతుంది. ఆ దిశగా కుప్పం మహిళ ఇప్పటికే మొదటి అడుగు వేసింది.



ఇటీవల జరిగిన ఉమ్మడి సమావేశంలో ప్రాజెక్ట్ గురించి మాట్లాడుతున్న కడా పీడీ వికాస్ మర్మత్



చిత్తూరులో షర్మన్ స్కూల్ వద్ద నేలవాలిన ఫ్లెక్సీ, చెట్టు

వర్షంతో ఆగిన విద్యుత్

చిత్తూరు కలెక్టరేట్, మే 2 (ఆంధ్రజ్యోతి):పలు మండలాల్లో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. చిత్తూరులోని సాంబయ్యకండ్రిగ సాయిబాబా గుడి వద్ద, గుడిపాలలో గాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో అందరూ టీవీలకు అతుక్కుపోయి అమరావతిలో ప్రధాన మంత్రి మోదీ సమావేశ లైవ్‌ను చూస్తుండగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. వెంటనే చాలామంది విద్యుత్ అధికారులకు ఫోన్ చేసి పీఎం సమావేశం వివరాలు చెప్పడంతో ఐదు నిమిషాలకంతా విద్యుత్ సరఫరాను అధికారులు పునరుద్ధరించారు.



చిత్తూరులో కమ్ముకున్న మేఘాలు

రెండు మండలాల్లో 40డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత

శుక్రవారం ఉదయం నుంచీ సాయంత్రం వరకు కాసిన ఎండల దెబ్బకు ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. తవణంపల్లెలో అత్యధికంగా 40.8, నగరిలో 40.7 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.చిత్తూరు, గంగాధరనెల్లూరు మండలాల్లో 39.5డిగ్రీలు, శ్రీరంగరాజపురంలో 39.3, గుడిపాలలో 39.1, సదుంలో 38.9, బంగారుపాళ్యం, సోమల మండలాల్లో 38.6, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాల్లో 38.2, బైరెడ్డిపల్లె, చౌడేపల్లె, ఐరాల, నింద్ర, పూతలపట్టు, వెదురుకుప్పం, పాలసముద్రం, పెనుమూరు, విజయపురం, యాదమరి మండలాల్లో 37.8, పెద్దపంజాణి, గంగవరం మండలాల్లో 37.4, శాంతిపురం, వి.కోట, గుడుపల్లె మండలాల్లో 36.9, కార్వేటినగరం, పలమనేరు మండలాల్లో 36.7, పుంగనూరులో 34.9, కుప్పంలో 34.8, రామకుప్పంలో 33.3 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

నేల రాలిన మామిడి

పెనుమూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు మండలంలో శుక్రవారం సాయంత్రం భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. మామిడి కాయలు నేల రాలడంతో పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. చార్వాగానిపల్లెలో అనిల్‌కు చెందిన ఇంటిపైనున్న రేకులు గాలికి ఎగిరి అవతల పడ్డాయి. దీంతో వర్షపు నీరు ఇంటిలోకి వెళ్లి పలు వస్తువులు పాడయ్యాయని తెలిపారు.




చార్వాగానిపల్లెలో ధ్వంసమైన రేకులు



సోమల వీధుల్లో తడిసిన వరి ధాన్యం

సోమలలో వడగండ్ల వాన

సోమల, మే 2 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో అకాల వర్షంతో పంటలు దెబ్బ తిన్నాయి.తమ్మినాయనపల్లె, నెల్లిమంద పంచాయతీల్లోని పలు గ్రామాల్లో వడగండ్ల వాన కురిసింది.టమోటా, దోస, మామిడి పంటలకు నష్టం జరిగింది.అరకొరగా ఉన్న మామిడికాయలు కూడా ఈదురు గాలులకు నేల రాలాయి.ఒబ్బిడి చేసిన వరి ధాన్యాన్ని రైతులు వీధుల్లో ఎండకు ఆరబెట్టగా వర్షంతో తడిసిపోయాయి. పలుచోట్ల కోతకు సిద్ధమైన వరిపంటలు నేలకొరిగాయి. టమోటా తోటల్లో వర్షపు నీళ్ల నిలవడంతో సాయంత్రం 6గంటలకు రైతులు పొలాల వైపు పరుగులు పెట్టారు. పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.



పలమనేరులో రాలిన మామిడి కాయలు - విరిగిపోయిన అరటిచెట్లు

పలమనేరులో పంట నష్టం

పలమనేరు, మే2 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మండలంలో శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి, వీచిన ఈదురు గాలులకు మామిడి తోటల్లో కాయలు రాలిపోయాయి. కాకర తోట వాలిపోగా, ఒక అరటి తోటలో చెట్లు విరిగిపోయాయి. ఈ ఏడాది ప్రారంభంలో మామిడి తోటల్లో విస్తారంగా పూత కనిపించినా జల్లుపూత కావడంతో మామిడి తోటల్లో 30 శాతం మాత్రమే కాయలు కనిపించాయి.10రోజుల క్రితం ఈదురుగాలుల కారణంగా మామిడి పిందెలు రాలిపోయాయి. శుక్రవారం వీచిన ఈదురు గాలులకు మిగిలిన మామిడి కాయల్లో 20 శాతం పైగా నేలపాలయ్యాయి.దీంతో మామిడి రైతులు ఈసారి కూడా దిగుబడి నామమాత్రమే వుంటుందన్న అంచనాతో క్రిమిసంహారక మందులు, ఎరువులు, తోటలు దున్నిన ఖర్చులు కూడా చేతికి రాకుండా పోతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎగిరిపోయిన ఇంటి పైకప్పు



యాదమరి, మే 2 (ఆంధ్రజ్యోతి):యాదమరి మండలవ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం గాలులతో కూడిన వర్షం కురిసింది.మామిడి పంటకు తీరని నష్టం వాటిల్లింది. దాసరాపల్లి పంచాయతీ ఆరిమాకులపల్లెలో ఈదురుగాలులకు ఓ ఇంటి పైకప్పు ఎగిరి పక్కన పొలంలో పడింది. ఆ ఇంట్లో సరుకులు, ఇంటి నిర్మాణం కోసం ఉంచిన సిమెంట్ బస్తాలు, ధాన్యం తదితర వస్తుసామాగ్రి మొత్తం నీటిపాలైంది. నాలుగు గ్రామాల్లో మామిడి, కొబ్బరి, అరటి, వరి పంటలు ధ్వంసమై రైతులకు నష్టం వాటిల్లింది.

తిరుపతి గంగజాతరకు 15 మందితో కమిటీ నియామకం

తిరుపతి(కలెక్టరేట్), మే 2(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఈ నెల 6 నుంచి 14వ తేదీ వరకు జరిగే తాతయ్యగుంట గంగమ్మ జాతరను పురస్కరించుకుని 15మందితో కలెక్టర్ వెంకటేశ్వర్ కమిటీ ఏర్పాటు చేశారు. రాయలసీమలోనే తిరపతి జాతర ప్రసిద్ధి చెందింది. గంగమ్మ గుడికి పాలకవర్గం ఏర్పాటు కాలేదు. ఈ క్రమంలో జాతర ఏర్పాట్లు, భక్తులకు సదుపాయాలు కల్పించేందుకు కమిటీని నియమించారు. ఇందులో తిరుపతి, చంద్రగిరి ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీటీడీ సభ్యులు పనబాక లక్ష్మి, భానుప్రకాష్‌రెడ్డి, శాప్ చైర్మన్ రవినాయుడు, రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, జనసేన, బీజేపీ జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్, సామంచి శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ ఆర్‌సీ మునికృష్ణ, టీడీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ మబ్బు దేవనారాయణరెడ్డి, టౌన్‌బ్యాంకు మాజీ చైర్మన్ పులుగోరు మురళి, తాతయ్యగుంట ఆలయ మాజీ చైర్మన్ చింతా భరణియాదవ్, టీడీపీ తిరుపతి నగర ప్రధాన కార్యదర్శి మహేష్‌యాదవ్ సభ్యులుగా ఉంటారు.

5న వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాక

చిత్తూరు రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు ఈ నెల 5వ తేదీన ఉమ్మడి జిల్లా పర్యటనకు వస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. 4వ తేదీన విజయవాడ నుంచి బెంగళూరుకు విమానం ద్వారా చేరుకుంటారు. 5న బెంగళూరు నుంచి రోడ్డు మార్గంలో కుప్పం చేరుకుని, అక్కడ వైద్య శాఖ అధికారులతో సమావేశం నిర్వహిస్తారు. అదే రోజున కుప్పం నుంచి చిత్తూరుకు చేరుకుంటారు. చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిని పరిశీలిస్తారు. అక్కడే జిల్లా వైద్య శాఖ అధికారులు, వైద్యులతో జోనల్ స్థాయి సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం తిరుపతి చేరుకుంటారు. 6వ తేదీన తిరుపతిలో ఫీల్డ్ విజిట్ చేశాక జిల్లా స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించనున్నారు.

మెగా డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా కింద 421 పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎస్‌డీవో బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. రాత పరీక్ష లేకుండా క్రీడాకారులకు మూడు శాతం హారిజాంటల్ రిజర్వేషన్ కల్పించనున్నారు. అర్హులైన అభ్యర్థులు sports.ap.gov.in, sportsdsc.apcfss.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు జిల్లా ప్రాధికార సంస్థ చిత్తూరు వారిని సంప్రదించాలి.



శ్రీవారి ఆలయంలో భాష్యకార్ల సాత్తుమొర


తిరుమల, మే2(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో శుక్రవారం భాష్యకార్ల సాత్తుమొర ఘనంగా జరిగింది. రామానుజులు జన్మించిన వైశాఖ మాస అరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఏటా భాష్యకార్ల సాత్తుమొర నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఉదయం భాష్యకార్లను ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగించారు. తర్వాత నడకదారిలోని భాష్యకార్ల సన్నిధిలో అభిషేకం నిర్వహించారు. సాయంత్రం సహస్రదీపాలంకార సేవ అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఒక తిరుచ్చిపై, భాష్యకార్లను మరో తిరుచ్చిపై ఊరేగించారు. అనంతరం ఆలయంలో విమాన ప్రాకారం చుట్టూ ప్రదక్షిణ చేశారు. రాత్రి భాష్యకార్ల సన్నిధిలో సాత్తుమొర నిర్వహించారు. ప్రత్యేక అభరణాలతో సళ్లింపు చేయడంతో కార్యక్రమం ముగిసింది జీయర్‌స్వాములు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి డీఎస్‌డీవోగా బాలాజీ

తిరుపతి(క్రీడలు), మే 2 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఇన్‌చార్జి డీఎస్‌డీవోగా ఎ.బాలాజీ నియమితులయ్యారు. ఇప్పటి వరకు కొనసాగిన సయ్యద్‌సాహెబ్ బుధవారం పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో చిత్తూరు డీఎస్‌డీవో బాలాజీకి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ శాప్ ఎండీ గిరీష ఉత్తర్వులు జారీచేశారు.

శ్రీవారి సర్వదర్శనానికి 17 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 17 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకున్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2 లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లు సర్వ దర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.



బుధవారం హుండీ ఆదాయం: రూ.3.04 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 57,863

తలనీలాలు సమర్పించినవారు: 31,030

నియోజకవర్గాల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 2 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలను అమలు చేయనున్నట్టు డీఆర్వో నరసింహులు తెలిపారు. దీనికోసం నియోజకవర్గ ప్రత్యేకాధికారులు, సిబ్బంది సకాలంలో ప్రత్యేక కార్యాచరణను రూపొందించాలన్నారు. 'నియోజకవర్గాల అభివృద్ధి- స్వర్ణాంధ్ర 2047' సాధనలో భాగంగా పద్మావతి మహిళా యూనివర్సిటీలోని సావేరీ హాలులో శుక్రవారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. నియోజకవర్గాలు అభివృద్ధి చెందితే జిల్లా, జిల్లాలు అభివృద్ధి చెందడం ద్వారా రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతాయన్నారు. నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్‌ను రూపొందించి, సకాలంలో నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేలా అందరూ కృషి చేయాలని ఏపీ సెక్రటేరియట్ ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ రాంబాబు సూచించారు. ప్రతి వ్యక్తి ఆర్థికంగా అభివృద్ధి చెందేలా కృషి చేయాలని ప్రణాళిక శాఖ సలహాదారు సీతాపతిరావు కోరారు. ప్రతి కుటుంబం ఒక పరిశ్రమలాగా రూపొంది, వృత్తి నైపుణ్యాల ద్వారా ఆర్థికాభివృద్ధిని సాధించేందుకు తోడ్పాటును అందించాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం ప్రతి వ్యక్తికీ, ప్రతి రంగంలో, ప్రతి పనిలో అదనపు ఆదాయం వచ్చేలా చూడాలన్నారు. ఎమ్మెల్యేలతో సంప్రదించి నియోజకవర్గ ప్లాన్‌ను ఈ నెలాఖరు లోపు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాలకు చెందిన నియోజకవర్గాల ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, జిల్లా గణాంకాధికారి ప్రేమచంద్ర, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న డీఆర్వో నరసింహులు

ఎర్రచందనం కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలు

● రూ.ఆరు లక్షల జరిమానా

తిరుపతి(నేరవిభాగం), మే 2 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం కేసులో ఇద్దరు స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ శుక్రవారం ఎర్రచందనం కోర్టు జిల్లా అదనపు న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పు చెప్పారు. అటవీశాఖ బీట్ అధికారి రాజేష్ తెలిపిన ప్రకారం.. కడప జిల్లా మాధవరానికి చెందిన రమేటి సుబ్బరాజు, వెంకటాపురం గ్రామానికి చెందిన గంపల యల్లయ్య 2019లో సిద్దవటం రేంజ్ పరిధిలోని ముతుకూరు బీట్‌లో రెండు ఎర్రచందనం దుంగలను తరలించడానికి సిద్ధంగా ఉంచారు. అప్పటి బీట్ అధికారి హైమావతి దేవి, రేంజర్ ప్రసాద్ వారిని పట్టుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి నరసింహమూర్తి.. ఒక్కో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ కేసులో లైజన్ అధికారులుగా రాజేష్, శ్రీనివాస్ వ్యవహరించారు. కోర్టు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బాలకృష్ణమ నాయుడు వాదనలు వినిపించారు.

'ఎర్ర' స్మగ్లర్ శివమణిపై పీడీ యాక్టు

తిరుపతి, మే 2 (ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు చెందిన ఎర్రచందనం స్మగ్లర్ శివమణి(35)పై తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్ పీడీ యాక్ట్ ప్రయోగిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను ప్రభుత్వం ఆమోదించింది. తిరువణ్ణామలై జిల్లా జమునమత్తూరు తాలూకా నల్లపట్టు గ్రామానికి చెందిన గోవిందన్ కుమారుడు శివమణి తరచూ ఎర్రావారిపాలెం మండల పరిసరాల్లోని అడవుల్లో ఎర్రచందనం చెట్లు నరికి దుంగలు అక్రమ రవాణా చేస్తున్నట్లు పోలీసు, టాస్క్‌ఫోర్స్ రికార్డులు చెబుతున్నాయి. ఇతడిపై పలు కేసులు నమోదు కావడంతో పాటు ప్రస్తుతం అరెస్టయి కడప సెంట్రల్ జైలులో రిమాండులో ఉన్నాడు. ఎర్రచందనం అక్రమ రవాణాలో కీలకంగా వ్యవహరిస్తుండడం, పలు కేసులతో నేర చరిత్ర కలిగివున్న నేపథ్యంలో అతడిపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తూ కలెక్టర్ మార్చి 22న ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై గత నెల 16వ తేదీన అడ్వైజరీ బోర్డు నిందితుడిని, దర్యాప్తు అధికారులను విచారించింది. నిందితుడి నేర చరిత్రను పరిగణనలోకి తీసుకున్న అడ్వైజరీ బోర్డు కలెక్టర్ విధించిన పీడీ యాక్టును సమర్థిస్తూ ప్రభుత్వానికి నివేదిక పంపింది. దీంతో కలెక్టర్ నిర్ణయాన్ని ఆమోదిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

అజ్ఞాతంలోకి 'ఎర్ర' దొంగలు

● పూచీకత్తు ఇచ్చిన ఇద్దరికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), మే 2(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం కేసులో ఇద్దరి పూచీకత్తుతో ఐదుగురు నిందితులు జైలు నుంచి విడుదలయ్యారు. వీరిలో ఒకరు చనిపోగా, మిగిలిన నలుగురు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. దీంతో పూచీకత్తుదారులకు భారీ జరిమానా విధిస్తూ ఎర్రచందనం కోర్టు జిల్లా ప్రత్యేక న్యాయమూర్తి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. అటవీశాఖ అధికారి కథనం మేరకు.. తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలై జిల్లా పెరియవళ్లి గ్రామానికి చెందిన ఎ.రమేష్, కుమార్, డి.చిన్నస్వామి, సుధాకర్, ఏలుమలై.. చిత్తూరు జిల్లా ఐరాల పరిధిలో ఎర్రచందనం దుంగలు అపహరించారు. ఈ ఘటనకు సంబంధించి ఐదేళ్ల కిందట ఐరాల పోలీసులు కేసు నమోదు చేశారు. ఐదుగురు నిందితులను అరెస్టు చేసి జైలుకు పంపారు. కొద్ది రోజుల తర్వాత వీరికి పీలేరుకు చెందిన జి.శేషాద్రి నాయుడు, ప్రసాద్ ష్యూరిటీ ఇచ్చి బెయిల్‌పై విడుదల చేయించారు. బెయిల్‌పై విడుదలైన ఐదుగురిలో ఎ.సుధాకర్ మృతి చెందాడు. మరో నలుగురికి న్యాయమూర్తి నాన్ బెయిలబుల్ సెక్షన్ కింద అరెస్టు చేసి తీసుకురావాలని పోలీసులను ఆదేశించారు. వారు అజ్ఞాతంలోకి వెళ్లిపోవడంతో సొంత పూచీకత్తుపై విడుదల చేయించిన ఇద్దరికి.. ఒక్కో నిందితుడికి రూ.20 వేల చొప్పున జరిమానా చెల్లించాలంటూ శుక్రవారం న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పు చెప్పారు.

ఆలయం ముందు భక్తులు



తిరుమలలో కొనసాగుతున్న రద్దీ

తిరుమల, మే 2 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో గురువారం సాయంత్రం పెరిగిన భక్తుల రద్దీ.. శుక్రవారమూ కొనసాగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్లు కాస్తా ఖాళీగానే కనిపించినప్పటికీ శని, ఆదివారాలు వరుస సెలవులు ఉండటంతో శుక్రవారం సాయంత్రం 5 గంటల తర్వాత రద్దీ పెరిగింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. వీరికి 17 గంటల దర్శన సమయం పడుతోంది. ఇక, స్లాటెడ్ టోకెన్లు, టికెట్లు ఉన్న భక్తులకు మూడుగంటల తర్వాత దర్శనం లభిస్తోంది. రద్దీ పెరిగిన క్రమంలో శ్రీవారి ఆలయ ప్రాంతంతో పాటు మాడవీధులు, లడ్డూకౌంటర్, అఖిలాండం, అన్నప్రసాద భవనం, సీఆర్వో, లేపాక్షి సర్కిల్, రాంభగీచ వంటి ప్రాంతాల్లో భక్తుల సందడి నెలకొంది. శని, ఆదివారాల్లోనూ ఈ రద్దీ కొనసాగే అవకాశముంది.


క్యూలైన్‌లో సర్వదర్శన భక్తులు



అద్భుతంగా అమరావతి



పవన్ స్వాగతం.. లోకేశ్ మోదీ చమత్కారం


కాజ టోల్ గేట్ వద్ద బారులు తీరిన వాహనాలు




సభా ప్రాంగణంలోనే వైద్య సేవలు


మహిళల విజయ దరహాసం

అద్వితీయంగా శంకుస్థాపన వేడుక ● రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల సందడి

వినాశనం నుంచి వికాసం దిశగా.. అమరావతి పరుగులు పెట్టేందుకు సిద్ధమైంది. శిథిలం నుంచి ప్రపంచం అచ్చెరువొందేలా ఆంధ్రుల కలల రాజధాని పునర్నిర్మాణం దిశగా పయనించనున్నది. ఈ అపురూప కార్యక్రమానికి శుక్రవారం రాజధాని పరిధిలోని వెలగపూడి వేదికగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ శ్రీకారం చుట్టారు. అమరావతి అభివృద్ధి మనమే చేయాలి.. మనమే చేస్తాం.. అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సాక్షిగా పిలుపిచ్చారు. దేవతల రాజధాని అమరావతి దేశాభివృద్ధికి కేంద్రంగా మారుతోందని.. ఆ స్థాయిలో అభివృద్ధి చేస్తామని మోదీ ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఇక అమరావతి కేంద్రంగా వివిధ ప్రాజెక్టులతో పాటు రాష్ట్రంలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ వివిధ ప్రాజెక్టులను ప్రారంభించి జాతికి అంకితం చేశారు. పునర్నిర్మాణ శంకుస్థాపన మహోత్సవానికి అతిరథ మహారథులతో పాటు ప్రధాన మంత్రి మోదీ రాకతో రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల వాతావరణం సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన జనాలతో రాజధానిలో పండుగ వాతావరణం కనిపించింది. - తుళ్లూరు, ఆంధ్రజ్యోతి




దుర్గ గుడి నుంచి సభా వేదిక వద్దకు సైకిల్‌పై వస్తున్న విజయనగరం ఎంపీ అప్పల నాయుడు


సభా వేదిక వద్దకు తరలివస్తున్న విద్యార్థినులు


సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన భోజనాలు


గ్యాలరీల బయట జనం

వివాహిత ఆత్మహత్య


స్వాతి మృత దేహం

వెదురుకుప్పం, మే 2 (ఆంధ్రజ్యోతి): ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కార్వేటినగరం మండలం కేశవకుప్పం గ్రామ పంచాయతీ పసలవానిమిట్టకు చెందిన జ్యోతిప్రకాష్, బెంగళూరుకు చెందిన స్వాతి అలియాస్ శిల్ప(21) ప్రేమించుకున్నారు. వీరి ప్రేమించుకున్నా.. పెద్దల సమక్షంలోనే సంప్రదాయ బద్ధంగా రెండేళ్ల కిందట పెళ్లి చేసుకున్నారు. వీరికి ఒక మగ బిడ్డ కూడా పుట్టాడు. ఆ బిడ్డకు త్వరలోనే పుట్టెంట్రుకలు తీసే కార్యక్రమం కూడా ఉంది. ఇంతలో ఏం జరిగిందో తెలియదు కానీ.. పసలవాని మిట్టలోని ఇంట్లో స్వాతి శుక్రవారం ఉరేసుకుంది. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం కార్వేటినగరం సీహెచ్‌సీకి తరలించారు. ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కార్వేటినగరం పోలీసులు రాత్రి తొమ్మిది గంటల వరకు కేసు నమోదు చేయలేదు.

'నీట్'కు ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్


పీవీకేఎన్ డిగ్రీ కళాశాలలో ఎస్పీ మణికంఠతో కలిసి సిబ్బందికి సూచనలు ఇస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు సెంట్రల్, మే 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన చిత్తూరులో ఆదివారం నిర్వహించే నీట్ (నేషనల్ ఎలిజిబులిటీ కం ఎంట్రన్స్ టెస్టు)ను ప్రశాంత వాతావరణంలో జరిగేలా ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ఎస్పీ మణికంఠతో కలిసి శుక్రవారం జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్, ఎస్పీ సావిత్రమ్మ డిగ్రీ కళాశాలల్లో ఏర్పాట్లను పరిశీలించి.. అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఎంబీబీఎస్, బీడీఎస్, బీఏఎంఎస్, బీహెచ్ఎంఎస్ వంటి మెడికల్ గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశాలకు ఎన్‌టీఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) నిర్వహించే ఈ పరీక్షను పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 432 మంది, ఎస్పీ సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో 278 మంది రాయనున్నారని చెప్పారు. ఆదివారం మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష కేంద్రం వెలుపల విద్యార్థుల తల్లిదండ్రులు వేచి ఉండటానికి షామియానా, తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. విభిన్న ప్రతిభావంతులకు వీల్‌చైర్లు అందుబాటులో ఉంచాలని, పరీక్ష కేంద్రంలోకి ఇన్విజిలేటర్లు, విద్యార్థులు.. సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతి లేదన్నారు. సెల్‌ఫోన్లు భద్రపర్చడానికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఎస్పీ మాట్లాడుతూ.. ప్రశ్నపత్రాలను ఆర్మ్‌డ్ పోలీసు బందోబస్తు ఎస్కార్ట్‌తో పరీక్ష కేంద్రాలకు తీసుకెళ్లే సమయంలో పూర్తి స్థాయి వీడియో, ఫొటోగ్రఫీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీవీకేఎన్, ఎస్పీ సావిత్రమ్మ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు జీవనజ్యోతి, మనోహర్, ఏఆర్ డీఎస్పీ మహబూబ్ బాషా, సూపరింటెండెంట్ డాక్టర్ శరవణ, సీఐలు నెట్టికంఠయ్య, మనోహర్ పాల్గొన్నారు.


పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేసిన బెంచీలు

మాజీ ఎంపీటీసీ ఇంట్లోకి దొంగలు..!

● రూ.3 లక్షల విలువైన ఆభరణాలు, రూ.80 వేల నగదు చోరీ


మంజులమ్మ ఇంట్లో తెరిచిన బీరువా, దొంగలు ప్రవేశించిన కిటికీని పరిశీలిస్తున్న కానిస్టేబుల్

పలమనేరు, మే 2 (ఆంధ్రజ్యోతి): తాళాలు వేసిన ఇంట్లో దొంగలు పడి సుమారు రూ.3 లక్షలు విలువైన బంగారు, వెండి ఆభరణాలతో పాటు రూ.80 వేలు నగదు చోరీ చేసుకెళ్లిన సంఘటన గురువారం అర్ధరాత్రి పలమనేరు మండలంలో జరిగింది. పోలీసులు, బాధితుల కథనం మేరకు.. మండలంలోని కొలమాసనపల్లి గ్రామంలో పలమనేరు-కుప్పం రహదారి పక్కనే నివాసముంటున్న మాజీ ఎంపీటీసీ మంజులమ్మ గురువారం శాంతిపురం మండలంలోని తన సోదరి కుమారుడి పెళ్లికి వెళ్లింది. ఈ సమయంలో మంజులమ్మ ఇంటి వెనుక వైపున ఉన్న కిటికీ గ్రిల్స్ తొలగించి ఇంట్లోకి ప్రవేశించారు. ఇంటిలోని మూడు గదుల్లో ఉన్న నాలుగు బీరువాలను పగులగొట్టి తెరిచారు. అందులోని రూ. 80 వేలు నగదుతో పాటు సుమారు రూ.3 లక్షలు విలువైన 20 గ్రాముల కుపైగా బంగారు ఆభరణాలు, 500 గ్రాములకు పైగా వెండి ఆభరణాలు, దేవుడి విగ్రహాలు చోరీ చేసుకెళ్లారు. శుక్రవారం ఉదయం ఇంటికి తిరిగొచ్చిన మంజులమ్మ తన ఇంట్లో దొంగలు పడినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు చేరుకుని పరిశీలించి వివరాలు సేకరించారు. పలమనేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపటి నుంచి ముక్కంటికి ధారా పాత్ర ఏర్పాటు

శ్రీకాళహస్తి, మే 2 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరస్వామికి ఆదివారం నుంచి 28వ తేదీ వరకు ధారాపాత్ర ఏర్పాటు చేయనున్నట్లు ఈవో బాపిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వైశాఖ శుద్ధ సప్తమి ఆదివారం డొల్లు కత్తెర ప్రారంభం అవుతన్న నేపథ్యంలో రెండవ కాల అభిషేకం అనంతరం స్వామివారి మూలవిరాట్ పైభాగాన ధారాపాత్ర ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు. ఏటా మండు వేసవిలో వచ్చే డొల్లకర్తరీ, నిజకర్తరీ సందర్భంగా స్వామివారిపై నిత్యం పచ్చకర్పూర జలం ధారగా పడేలా ఈ పాత్ర ఏర్పాటు చేస్తారని తెలిపారు.

పిడుగుపాటుకు రైతు మృతి

ఎర్రావారిపాలెం, మే 2 (ఆంధ్రజ్యోతి): వరి ధాన్యాన్ని కళ్లంబండ మీద ఆరపెడుతున్న రైతు.. పిడుగుపాటుకు మృతిచెందారు. వివరాలిలా ఉన్నాయి. ఎర్రావారిపాలెం మండలం బోడేవాండ్లపల్లె పంచాయతీ వడ్డిపల్లెకు చెందిన కోటకొండ భారతి, రమణ దంపతులు రెండు రోజుల కిందట వరి కోత కోశారు. ఊరికి దగ్గరలోని కళ్లం బండ మీద ధాన్యాన్ని శుక్రవారం ఆర బెట్టారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో వర్షం వస్తుండడంతో ధాన్యాన్ని కుప్పతోసి టార్పాలిన్ పట్ట కప్పారు. ఈదురు గాలికి పట్ట పైకి లేవకుండా రాయి తీసుకొచ్చి పెట్టేందుకు అక్కడ్నుంచి 50 అడుగుల దూరం వెళ్లారు. అదే సమయంలో.. అక్కడ పిడుగు పడటంతో రమణ కుప్పకూలారు. దగ్గరలో ఉన్న ఆయన భార్య భారతి షాక్‌కు గురై స్పృహ తప్పారు. అక్కడే కళ్లంలో పొరుగు రైతు రమణ వద్దకు వెళ్లి చూడగా అప్పటికే విగతజీవిగా పడిపోయి ఉన్నారు. భారతిని ఇంటికి చేర్చిన స్థానికులు, రమణ మృతి విషయాన్ని బంధువులకు తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదం నెలకొంది. కాగా, చిన్నగొట్టిగల్లు మండలం తుమ్మచేనుపల్లెలో పిడుగుపాటుకు పాడి ఆవు మృతి చెందింది.

రైతులకు వరంగా రెవెన్యూ సదస్సులు

20 ఏళ్ల భూ సమస్యలూ పరిష్కారం

విజయపురం, మే 2 (ఆంధ్రజ్యోతి): రైతులకు రెవెన్యూ సదస్సులు వరంగా మారాయి. విజయపురం మండలంలో 20 ఏళ్లుగా ఉన్న భూ సమస్యలు కూడా పరిష్కారం కావడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల కిందట మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి 264 వినతులందాయి. గ్రామాల వారీగా.. పన్నూరులో 49, కళియంబాకంలో 24, గంగమాంబాపురంలో 19, కాళికాపురంలో 19, మంగళంలో 14, శ్రీహరిపురంలో 26, మహారాజపురంలో 8, కోసలనగరంలో 10, పాతార్కాడులో 10, ఇళ్లత్తూరులో 12, విజయపురంలో 39, సామిరెడ్డి కండ్రిగలో ఒకటి, ఎల్లసముద్రంలో ఒకటి, బూచివానత్తంలో 3, జగన్నాథపురంలో ఒకటి, కేవీపురంలో రెండు, విజయరాఘవపురంలో రెండు అర్జీల చొప్పున ఉన్నాయి. వీటిలో 261 అర్జీల వరకు రెవెన్యూ సమస్యలకు సంబంధించినవే. డీకేటీ భూముల్లో ఫ్రీహోల్డ్ నియంత్రణ ఉండడంతో కొన్ని అర్జీలను రిజెక్టు చేశారు. సుమారు 240 సమస్యలు పరిష్కారం కావడంతో రైతులు సంతోషం వెలిబుచ్చారు. ఏళ్లతరబడి ఆన్‌లైన్ కాని భూములు, వెబ్‌ల్యాండ్‌లో సమస్యలు, నోషనల్ ఖాతాలో ఉన్న పట్టా భూముల సమస్యలు పరిష్కారం కావడంతో థ్యాంక్యూ సీఎం సార్ అంటూ రైతులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.


తహసీల్దార్ కిరణ్ ద్వారా వన్‌బీ అందుకుంటున్న ఏలుమలై (ఫైల్ ఫొటో)

20 ఏళ్ల సమస్య పరిష్కారం



20 ఏళ్లుగా ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నాను. భూమి 40 ఏళ్లుగా మా అనుభవంలో ఉంది. పూర్వీకుల నుంచి వచ్చిన భూమి ఆన్‌లైన్ లేకుండా ఉండి పోవడంతో ఆఫీసుల చుట్టూ తిరిగినా ఫలితం లేదు. విజయపురం రెవెన్యూ సర్వే నెంబరు 317/14కెలో 1.23 ఎకరాలు, సర్వే నెంబరు 317/12లో 0.24 ఎకరాలు మొత్తం 1.47 ఎకరాల భూమి ఆన్‌లైన్‌లో లేదని అర్జీ ఇచ్చాను. తహసీల్దార్ కిరణ్ జిల్లా అధికారులకు ఫైలు పంపి.. సమస్య పరిష్కరించారు.

- రఘుపతిరాజు, విజయపురం

సీఎంకు జీవితాంతం రుణపడి ఉంటాను



నాకు ప్రాణం ఉండగా భూ సమస్య పరిష్కారం కాదనుకున్నాను. ఆన్‌లైన్ రికార్డు లేకుండా పోతుందేమోనని ఆందోళనపడ్డాను. కళియంబాకం రెవెన్యూలో సర్వే నెంబరు 3/10లో 0.84 ఎకరాలు భూమిపై అర్జీ ఇవ్వడంతో అధికారులు ఆన్‌లైన్ చేసి పట్టాదారు పాసుపుస్తకం చేతిలో పెట్టారు. సీఎం చంద్రబాబుకు జీవితాంతం రుణపడి పడి ఉంటాను.

- ఏలుమలై, మాధవరం

భూ సమస్యల పరిష్కారానికి కృషి

భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం. మండలంలో వెబ్‌ల్యాండ్ కరెక్షన్, డీకేటీ, ఫ్రీహోల్డ్ భూముల సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. బాధితులు సంబంధిత రికార్డులతో రెవెన్యూ అధికారులను సంప్రదిస్తే సమస్యలను పరిష్కరించేలా చూస్తాం. ప్రజలందరికీ నిత్యం అందుబాటులో ఉండి మస్యలు పరిష్కరిస్తాం.

- కిరణ్, తహసీల్దార్, విజయపురం

పంటలపై ఆగని గజదాడులు..!


ఒంటరి ఏనుగు దాడిలో ధ్వంసమైన టమోటా పంట

కల్లూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై గజదాడులు ఆగడంలేదు. మండలంలోని కమ్మపల్లి, రాయవారిపల్లి పంచాయతీల్లో గురువారం రాత్రి ఒంటరి ఏనుగు పంటలను ధ్వంసం చేసింది. ముందుగా తూర్పు విభాగం అటవీ ప్రాంతం నుంచి బయలుదేరిన ఒంటరి ఏనుగు కమ్మపల్లి పంచాయతీ గంటావారిపల్లి వద్దకు చేరుకుంది. గ్రామంలోని రైతు యల్లప్పకు చెందిన టమోటా పంటను ధ్వంసం చేసింది. టమోటా చెట్లకు దన్నుగా నాటిన కొయ్యలను విరిచేసింది. ఇదే గ్రామంలోని రైతు ప్రభాకర్‌కు చెందిన వరి పంటను తొక్కేసింది. అక్కడి నుంచి రాయవారిపల్లి పంచాయతీ పాశంవారిపల్లిలోని రైతు హరికి చెందిన వరి పంటను ధ్వంసం చేసింది. పేరావాండ్లపల్లి సమీపంలోని ఉలవలగుట్ట వద్ద ఉన్న ఓ రేకుల షెడ్డును ఒంటరి ఏనుగు తోసేసింది. అక్కడి నుంచి నన్నూరివారిపల్లి పంచాయతీ బలిజపల్లి సమీపంలోని పులిచెర్ల- మంగళంపేట ఆర్‌అండ్‌బీ రోడ్డును దాటుకుంది. అనంతరం గడ్డంవారిపల్లి పంచాయతీ మీదుగా మంగళంపేట సెక్షన్ అడవిలోకి చేరుకున్నట్లు స్థానికులు తెలిపారు. ఒంటరి ఏనుగు వెళ్లిన మార్గంలో వివిధ రకాల పంటలను ధ్వంసం చేసుకుంటూ అడవిలోకి వెళ్లింది. ధ్వంసమైన పంటలను శుక్రవారం అటవీశాఖ సిబ్బంది పరిశీలించారు. కమ్మపల్లి, రాయవారిపల్లి, నన్నూరివారిపల్లి, గడ్డంవారిపల్లి పంచాయతీల్లో ఒంటరి ఏనుగు జాడను గుర్తించేందుకు ఏనుగు నడిచిన పాదముద్రలను అనుసరిస్తూ అటవీశాఖ సిబ్బంది ముందుకెళ్లారు. సాయంత్రం అయినా ఏనుగు జాడను గుర్తించలేకపోవడంతో అటవీశాఖ సిబ్బంది వెనుదిరిగారు.

పంటలపై ఏనుగుల దాడి


ఏనుగులు ధ్వంసం చేసిన కంచె

బంగారుపాళ్యం, మే 2 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం మండలంలోని మొగిలి సమీపంలో ఉన్న అటవీప్రాంతంలో గురువారం రాత్రి ఏనుగులు పంటలపై దాడి చేశాయి. మొగిలి రైతు శ్రీరాములరెడ్డికి చెందిన మామిడి చెట్లను విరిచేసి, కంచెను ధ్వంసం చేశాయి. అదే గ్రామానికి చెందిన మొగిలప్పకు చెందిన వరి పంటను సైతం తొక్కేశాయి. చేతికందే సమయంలో పంటలను ఏనుగులు నాశనం చేస్తున్నాయని రైతులు వాపోయారు. ఇప్పటికైనా సోలార్ కంచె ఏర్పాటు చేసి, ఏనుగుల దాడులను నివారించాలని కోరుతున్నారు.

బర్డ్ డైరెక్టర్‌గా జగదీష్

● సీఎం సూచనలతో టీటీడీ ఉత్తర్వులు



తిరుపతి, మే2(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని బాలాజీ వికలాంగుల శస్త్రచికిత్స, పరిశోధన, పునరావాస కేంద్రం (బర్డ్) డైరెక్టర్‌గా డాక్టర్ గుడారు జగదీష్‌ను నియమిస్తూ టీటీడీ ఈవో శ్యామలరావు ప్రొసీడింగ్స్ ఇచ్చారు. సీఎం చంద్రబాబు నాయుడు గత నెల 2న అమరావతిలో టీటీడీపై సమీక్షించిన సందర్భంలో డాక్టర్ జగదీష్‌ను బర్డ్ డైరెక్టర్‌గా నియమించాలని సూచించారు. ఆమేరకు ఇటీవల జరిగిన టీటీడీ పాలకమండలిలో నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. ఏడాదిపాటు కాంట్రాక్ట్ పద్ధతిన డైరెక్టర్‌గా నియమిస్తూ నెలకు రూ.2లక్షల వేతనం, వాహనం, ఇతర సౌకర్యాలను కల్పిస్తూ ఈవో ఉత్తర్వులు ఇచ్చారు.

అవమానించిన చోటే..

1992లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బర్డ్‌లో చేరిన డాక్టర్ జగదీష్ ఏడాదికే ఇన్‌చార్జి డైరెక్టర్‌గా నియమితులయ్యారు. మూడేళ్ల తర్వాత పూర్తిస్థాయి డైరెక్టర్ అయ్యారు. దాదాపు మూడు దశాబ్దాలపాటు బర్డ్ డైరెక్టర్‌గా జగదీష్ కొనసాగారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన్ను డైరెక్టర్ బాధ్యతలనుంచి తప్పించారు. విచారణ అంటూ హడావుడి చేసి అవమానించారు. అప్పటినుంచి ద్వారకాతిరుమలలోని 'విర్డ్ ట్రస్ట్ ఆస్పత్రి డైరెక్టర్‌గా పనిచేస్తూనే బర్డ్‌కు అలవాటైన రోగులకోసం ప్రతివారం రాస్ బిల్డింగ్‌లో ఉచిత ఓపీలు చూసేవారు.

ఒకప్పటి బర్డ్‌లా లేదు...

బర్డ్.. ఆసియా ఖండంలోనే అతిపెద్ద ఆర్థోపెడిక్ ఆస్పత్రి. మూడున్నర దశాబ్దాలుగా లక్షలాది మంది జీవితాలలో వెలుగులు నింపిన దవాఖానా. గత వైసీపీ ప్రభుత్వం అన్ని వ్యవస్థలు, సంస్థలను నాశనం చేసినట్టే తిరుపతిలోని బర్డ్‌నూ భ్రష్టు పట్టించింది. బర్డ్ ఆస్పత్రి 350 పడకల సామర్థ్యంతో, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 700కు పైగా అవుట్ పేషెంట్లు వైద్య సేవల కోసం వస్తుంటారు. రోగులకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించేందుకు ఆధునిక వసతులు ఉన్నాయి. అత్యవసర వైద్యంలో భాగంగా 6 అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లలో రోజుకు 20 వరకు శస్త్ర చికిత్సలు జరిగే సౌలభ్యం ఉంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆపరేషన్ల సంఖ్య దారుణంగా పడిపోయింది. ఒకప్పుడు బర్డ్‌లో ఓపీ తీసుకోవాలంటే ఉదయం 5 గంటలకే చేరుకోవాలి. వారంతో పనిలేకుండా ఆ స్థాయిలో రద్దీ ఉండేది. మధ్యలో ఏదైనా సెలవు వస్తే తర్వాత రోజు రెట్టింపు రోగులు వచ్చేవారు. గడిచిన ఐదేళ్లుగా పరిస్థితి మారిపోయింది. టీటీడీ నిధులతో నిర్వహించే ఆస్పత్రిని కమర్షియల్‌గా మార్చడంతో సహజంగా పేదరోగుల సంఖ్య తగ్గుతూ వచ్చింది.

బర్డ్‌కు పూర్వ వైభవం తెస్తా: జగదీష్

బర్డ్‌కు పూర్వ వైభవం తీసుకొస్తానని నూతనంగా నియమితులైన డైరెక్టర్ జగదీష్ తెలిపారు. శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడారు. 30 ఏళ్లపాటు పనిచేసిన అనుభవంతో బర్డ్‌ను ఏవిధంగా గాడిలో పెట్టాలో తగిన ప్రణాళికలు ఉన్నాయన్నారు. బర్డ్‌కున్న జాతీయ స్థాయి గుర్తింపు దృష్ట్యా వైద్యసేవలను మరింత విస్తరించేందుకు కృషి చేస్తామన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సీఎం చంద్రబాబు నాయుడికి, కూటమి పెద్దలకు, టీటీడీ పాలకమండలికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఆంగ్ల భాషపైనా పట్టు సాధించండి

- బీసీ హాస్టల్ విద్యార్థులకు కలెక్టర్ సూచన


విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు అందజేస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు కలెక్టరేట్, మే 2 (ఆంధ్రజ్యోతి): మాతృభాషలో ప్రావీణ్యం పొందడంతో పాటు ఆంగ్ల భాషపైనా పట్టు సాధించాలని బీసీ హాస్టల్ విద్యార్థులకు కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బీసీ హాస్టల్‌లో ఉండి చదువుతూ 2024-25లో టెన్త్‌లో 500కుపైగా మార్కులు సాధించిన తొమ్మిది మంది విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు ప్రదానం చేసి, అభినందించారు. సర్టిఫికెట్లు అందుకున్న వారిలో.. యు.రాకేష్ యాదవ్ (553)-పలమనేరు, బి.చరణ్ తేజ (552)-వి.కోట, ఎం.వర్ష (546)-వి.కోట, సి.పి. దీపక్ (543)-పుంగనూరు, ఇ.తరుణ్ (519)- కత్తెరపల్లె, ఒ.జితీష్ (518)- వి.ఆర్. కుప్పం, జి.దినేష్ (503)-పచ్చికాపల్లం, సి.తులసి (502)- పాలసముద్రం, పి.గాయత్రి (501) - వి.కోట ఉన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ, సాధికారిత అధికారి కె.మునీంద్రయ్య, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ జగ్గయ్య, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు సోమసుందర్ రెడ్డి, కుప్పుస్వామి, ఉమాదేవి, హేమలత, కోటేశ్వరరావు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌కవేటర్‌ను ఢీకొన్న ఆటో

● తీవ్రంగా గాయపడ్డ తండ్రీకొడుకులు
● తండ్రి పరిస్థితి విషమం


రోడ్డుపై నుంచి ఆటోను తొలగిస్తున్న పోలీసులు

గుడిపాల, మే 2 (ఆంధ్రజ్యోతి): ఓ ఆటో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ఎక్స్‌కవేటర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న తండ్రీకొడుకులు తీవ్రంగా గాయపడ్డారు. గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు నుంచి వేలూరు వైపు వస్తున్న ఆటో గుడిపాల మండలంలోని అనుపు వద్దకొచ్చేసరికి ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి.. అదుపు తప్పి దాని వెనుకనే ఉన్న ఎక్స్‌కవేటర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో ధ్వంసమవగా, అందులో ప్రయాణిస్తున్న నగరికి చెందిన తండ్రీకొడుకులు రుష్యేంద్రకుమార్, భువనచంద్ర తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను చికిత్స నిమిత్తం 190రామాపురం సీఎంసీలో చేర్పించారు. తండ్రి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


గాయపడిన భువన చంద్ర, రుష్యేంద్రకుమార్

అకాల వర్షంతో నష్టం


చెట్టు కూలి మృతి చెందిన ఆవు నేలకూలిన ట్రాన్స్‌ఫార్మర్

గుడిపాల,మే 2(ఆంధ్రజ్యోతి):గుడిపాల మండలం కొండాపురంలో వీచిన పెను గాలులకు ఓ చెట్టు కూలి పాడిఆవు మృతి చెందింది.పంటలకు కూడా నష్టం జరిగింది. పలు చోట్ల మామిడి కాయలు నేలరాలాయి. విపరీతంగా గాలులు వీచడంతో 10 విద్యుత్ స్తంభాలు విరిగిపోవడంతో పాటు చీలాపల్లె వద్ద ఓ ట్రాన్స్‌ఫార్మర్ నేల కూలింది.దీంతో రాత్రి 7.30 గంటల వరకు కరెంటు లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

వ్యక్తిగత శుభ్రతతోనే ఆరోగ్యం



కిశోరి వికాసంపై పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

రొంపిచెర్ల, మే 2 (ఆంధ్రజ్యోతి) వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమని.. కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బొమ్మయ్యగారిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో కిశోరి వికాసం కార్యక్రమంపై పోస్టర్లను ఆవిష్కరించారు. విద్య ప్రాముఖ్యత, రుతుస్రావం, వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారం, బాల్యవివాహాల కారణంగా నష్టాలు, చట్టాలపై అవగాహన కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు సహదేవ, పంచాయతీ కార్యదర్శి హరిబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీషా, మహిళా పోలీస్ రేష్మ, ఆరోగ్య కార్యకర్త గాయత్రి పాల్గొన్నారు.

11న మాలల ఆత్మీయ గౌరవ సభ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్

పుంగనూరు రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఈనెల 11న తిరుపతిలో జరిగే మాలల ఆత్మీయ గౌరవసభను జయప్రదం చేయాలని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక మాలమహానాడు కార్యాలయంలో మాలల ఆత్మీయ గౌరవసభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభకు మాల కులస్తులైన మేధావులు, విద్యార్థులు, మాల సంఘ నాయకులు, ఉద్యోగ సంఘ నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు రాయలసీమ మాల సభ కన్వీనర్ మల్లారపు మధు, వెంకటస్వామి, సదుం రవికుమార్, శ్రీనివాసులు, కృష్ణమూర్తి, బ్యాంక్ రెడ్డెప్ప, కూరపర్తి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నాటుకోళ్లకు భలే గిరాకీ..!



బండకిందపల్లె వద్ద నాటుకోళ్ల పెంపకం

రొంపిచెర్ల, మే 2 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల వద్ద పెంచుకుంటున్న నాటుకోళ్లకు గిరాకీ ఏర్పడింది. మండలంలోని బండకిందపల్లె పంచాయతీ మట్లోళ్లపల్లె వద్ద నాటుకోళ్ల పెంచుతున్నారు. కొలస్ట్రాల్, షుగర్ వ్యాధితో బాధపడుతున్న వారు నాటుకోడి మాంసంపై ఆసక్తి చూపుతున్నారు. నాటుకోడిని కిలో రూ.500 నుంచి రూ.550 వరకు కొనుగోలు చేస్తున్నారు. పుంజుకోళ్ల, పందెం కోళ్లకు గిరాకీ పెరుగుతోంది. వేలల్లో ఆదాయం వస్తుంది. దీంతో కోళ్ల పెంపకదారులకు ఉపాధి లభిస్తోంది. ప్రభుత్వం వెలుగు సంఘాల సభ్యులకు నాటు కోళ్ల పెంపకానికి ప్రోత్సాహం అందించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎట్టకేలకు తొలగిన చెత్త



పాఠశాల వద్ద చెత్తను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చౌడేపల్లె, మే 2 (ఆంధ్రజ్యోతి): పుదిపట్ల హైస్కూల్ వద్ద ఉన్న చెత్తను అధికారులు ఎట్టకేలకు తొలగించారు. శుక్రవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'పాఠశాల చెంతనే చెత్త' అనే శీర్షికన వార్తాకథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన పంచాయతీ అధికారులు కొన్ని నెలల నుంచి నిల్వ ఉన్న చెత్తను శుభ్రం చేసి పారిశుధ్య చర్యలు చేపట్టారు. స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

ఘనంగా గంగమ్మ ఆలయ కుంభాభిషేకం



వీర్నమల తాండాలో కుంభాభిషేకంలో పాల్గొన్న టీడీపీ నేతలు

రామకుప్పం, మే 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దతాండా పంచాయతీ ఇంద్రాకాలనీ గ్రామంలో నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయ కుంభాభిషేక వుడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. టీడీపీ మండలాధ్యక్షులు ఆనందరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చిన్నకృష్ణ నేతలు భూపతి, రామిరెడ్డి నాయక్, మునీంద్ర నాయక్, బాలరాజు, సుబ్రహ్మణ్యం, మురళీ మోహన్ పాల్గొన్నారు.

పుంగనూరు మున్సిపల్ మేనేజర్‌గా రెడ్డీశ్వరి



పుంగనూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మున్సిపల్ మేనేజర్‌గా రెడ్డీశ్వరి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పుంగనూరులో మున్సిపల్ మేనేజర్‌గా పని చేస్తున్న విజయభారతి హిందూపురం మున్సిపాలిటీకి బదిలీ కావడంతో మదనపల్లె మున్సిపాలిటీలో పని చేస్తున్న రెడ్డీశ్వరి పదోన్నతిపై పుంగనూరుకు వచ్చారు.

ఉద్యోగ అవకాశాలకు యువతకు ఉచిత శిక్షణ

పలమనేరు, మే 2 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ హబ్ తో నిరుద్యోగ యువతీ యువకులకు డొమెస్టిక్ డేటాఎంట్రీ ఆపరేటర్, ఆఫీస్ అసిస్టెంట్ ఉద్యోగాలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశులు తెలిపారు. శిక్షణ తీసుకున్న అభ్యర్థులకు ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్, నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ల ద్వారా సర్టిఫికెట్లు అందించనున్నట్లు పేర్కొన్నారు. పలమనేరు నియోజకవర్గంలోని పదో తరగతి చదివిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశులు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు రిజిస్ట్రేషన్ కోసం ఫోన్‌నంబరు 8465830771 ను సంప్రదించాలన్నారు. రిజిస్ట్రేషన్ కోసం అభ్యర్థుల ఆధార్, మార్కులిస్టుల జిరాక్సులు, పాస్‌పోర్టు సైజు ఫొటోలను తీసుకురావాలని కోరారు.

మైనారిటీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

పలమనేరు, మే 2 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మున్సిపాలిటీలోని మైనారిటీలు మైనారిటీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి కోరారు. స్వయం ఉపాధి కోసం రాయితీ రుణాలను అందజేస్తారని తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను స్వయంగా వెబ్‌సైట్ లోగాని, సచివాలయంలో గాని దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్, పాస్‌పోర్టు సైజు ఫొటో, రేషన్‌కార్డు, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, మొబైల్ నంబరు, బ్యాంకు పాసుపుస్తకంతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



వెంకటేష్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న ఆనందరెడ్డి

రామకుప్పం, మే 2 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం మనేంద్రం పంచాయతీ అత్తికుప్ప గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త సుబ్రహ్మణ్యం శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన మృతి పట్ల టీడీపీ మండలాధ్యక్షులు ఆనందరెడ్డి నేతలు రామలింగారెడ్డి, జ్ఞానశేఖర్‌రెడ్డి, సురేష్, మోహన్, రమేష్ తదితరులతో కలిసి సుబ్రహ్మణ్యం మృతిదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. పార్టీ తరపున మృతుడి కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు.

స్థల దాతకు సన్మానం

సోమల, మే 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్వయంభేశ్వరస్వామి ఆలయం వద్ద నివాసులైన ఎమిశెట్టి శంకరయ్య, రెడ్డెప్ప కుటుంబ సభ్యులు తమ ఇంటి స్థలాన్ని ఆలయానికి వితరణ చేసి తిరుపతిలో స్థిరపడ్డారు. ఆ స్థలంలో ప్రస్తుతం శివపార్వతుల కల్యాణ మండప నిర్మాణాలు చేపట్టారు. దీంతో స్థల దాతల కుటుంబ సభ్యులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. అలాగే కల్యాణ మండపానికి రూ. 2 లక్షలు విరాళం అందజేసిన దొంగరి సిద్ధమల్లయ్య, పార్వతమ్మలను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించి అభినందించారు. ఈ నేపథ్యంలోనే ఉపాధ్యాయురాలు జీలా అరుణకుమారి రూ.10 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సోమశేఖర్, లింగయ్య, రామసిద్ధులు, అర్చకులు విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి తెలుగు మాట్లాడటం హర్షణీయం

గంగవరం, మే 2 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమరావతి నగర పునర్నిర్మాణ సభ ప్రారంభోత్సవంలో శుక్రవారం తెలుగులో ప్రసంగించడం హర్షనీయమని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్ష, కార్యదర్శులు తులసీనాధం నాయుడు, పుష్ప తెలిపారు. తన ప్రసంగంలో మధ్య మధ్యలో తెలుగులో మాట్లాడుతూ తెలుగుభాష ఔన్నత్యాన్ని చాటిచెప్పారన్నారు. ఇదే స్ఫూర్తితో మన రాష్ట్రంలోనూ అన్ని ప్రభుత్వ, అధికార కార్యక్రమాలు తెలుగులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మండీల కోసం దరఖాస్తు చేసుకోండి

సోమల, మే 2 (ఆంధ్రజ్యోతి): సోమల మార్కెట్ యార్డులో నూతనంగా నిర్మించిన అద్దె గదులలో వ్యాపార లావాదేవీలకు దరఖాస్తులు చేసుకోవాలని ఏఎంసీ ఛైర్మన్ శ్రీనివాసులు నాయుడు తెలిపారు. మార్కెట్ యార్డులో టమోటా, మామిడి, చింతకాయలకు ప్రత్యేకంగా గదులు కేటాయించామని.. ఆసక్తి ఉన్న వ్యాపారులు ఏఎంసీ కార్యాలయంలోని కార్యదర్శిని కలిసి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం

● పుష్పపల్లకిలో ఊరేగిన స్వామి, అమ్మవార్లు ● ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



సీతారాములకు కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

కల్లూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం అయ్యావాండ్లపల్లి పంచాయతీ యర్రంవాడ్లపల్లిలో వెలసిన కోదండరామస్వామి ఆలయంలో శుక్రవారం సీతారాముల కల్యాణోత్సవం వేడుకలు కమనీయంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం గంగ స్వీకరణ, గణపతి హోమం, అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి వివిధ రకాల పుష్పాలతో ముస్తాబైన కల్యాణ మండపంలో సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఆశీనులు గావించారు. మంగళ వాయిద్యాలు.. అర్చకుల వేదమంత్రాల నడుమ సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. కల్యాణోత్సవం వేడుకలో పాల్గొన్న దంపతులకు పసుపు, కుంకుమ, పూలు, ప్రసాదం అందజేశారు. గ్రామంలోని పురవీధుల్లో స్వామి అమ్మవార్లకు పుష్పపల్లకి సేవ నిర్వహించారు. ఉభయదారులుగా మహేష్, గిరిబాబు, శిద్దనాగులు, పురుషోత్తం, చరణ్‌తేజ దంపతులు వ్యవహరించారు. ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో 30 మందికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

గంగవరం, మే 2 (ఆంధ్రజ్యోతి): ఎంవీఆర్ కళాశాలకు చెందిన 30 మంది విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీసుధ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంవీఆర్ కళాశాలలో బెంగళూరుకు చెందిన ఆల్ డిజీటెక్, క్యూసీయస్ కంపెనీల నిర్వాహకులు ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఎంపికల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 30 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసి వారికి ఏడాదికి రూ.2.50 నుంచి రూ.3 లక్షల వరకు ప్యాకేజీ ఇవ్వనున్నట్లు కంపెనీ హెచ్‌ఆర్‌లు బావా ఫకృద్దీన్, ముక్తియార్ తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్ ఎంవీఆర్ రెడ్డి, ప్రిన్సిపాల్ అభినందించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



కుప్పం, మే 2 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో శుక్రవారం చిరంజీవి (19) అనే యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. గుడుపల్లె మండలం కంచిబందార్లపల్లె గ్రామానికి చెందిన వెంకటేష్, లక్ష్మీ దంపతుల కుమారుడు చిరంజీవి కుప్పం పట్టణానికి చెందిన వేద పండితుడు బాబు స్వామి వద్ద రెండేళ్లుగా డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతను కుప్పంలోనే చిత్తరంజన్ రోడ్డులోని ఓ గదిలో ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం బాబుస్వామికి, ఇతరులకు టిఫిన్ తెచ్చి ఇచ్చి రూమ్‌కు వెళ్లాడు. సాయంత్రం అయినా చిరంజీవి తిరిగి రాకపోవడంతో బాబుస్వామి అతడికి ఫోన్ చేశాడు. అటు నుంచి స్పందన లేకపోవడంతో అనుమానం వచ్చి కొందరు రూముకు వెళ్లి చూశారు. గదిలో ఫ్యానుకు పంచెతో ఉరి వేసుకున్న రీతిలో కనిపించిన చిరంజీవి మృతదేహం కనిపించింది. దీంతో పోలీసులకు ఫోన్ చేయగా పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కుప్పం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ప్రేమ వ్యవహారంలో విఫలమైనందు వల్లే చిరంజీవి ఆత్మహత్య చేసుకున్నట్టు గ్రామస్తులు అనుమానిస్తున్నారు. కుప్పం అర్బన్ ఎస్సై బాబును వివరణ కోరగా కుటుంబ సమస్యల వల్లే ఆత్మహత్య చేసుకున్నట్టు చెప్పారు.

సీహెచ్‌వోలకు ఎఫ్‌ఆర్‌ఎస్‌ల నుంచి మినహాయింపు ఇవ్వండి



కలెక్టరేట్ వద్ద సమ్మె చేస్తున్న సీహెచ్‌వోలు

చిత్తూరు అర్బన్, మే 2 (ఆంధ్రజ్యోతి): సీహెచ్‌వోలకు ఎఫ్‌ఆర్‌ఎస్‌ల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, జిల్లా గౌరవాధ్యక్షుడు నాగరాజన్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ వద్ద సీహెచ్‌వోలు ఐదు రోజులుగా చేస్తున్న సమ్మెకు ఏఐటీయూసీ నేతలు మద్దతు పలికారు. వారు మాట్లాడుతూ.. సీహెచ్‌వోలు ఆరేళ్లుగా పనిచేస్తున్నప్పటికీ ఇంతవరకు వారిని పర్మినెంట్ చేయలేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా సీహెచ్‌వోల సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే జిల్లా వ్యాప్తంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని హెచ్చరించారు.

చిత్రలేఖన పోటీలు

చిత్తూరు కల్చరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా చిన్నారులకు ఆధ్యాత్మిక, సాంస్కృతిక అంశాలపై ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. గిరింపేట సత్యసాయి సంస్థాన్, కొంగారెడ్డిపల్లె ఉషానగర్ కాలనీ బాలవికాస్, సంతపేట కేంద్రాల్లో శుక్రవారం చిన్నారులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఆరో తేదీన బహుమతులు అందించనున్నట్లు తెలిపారు.

అక్క దేవతలకు పచ్చ పూజలు



అక్క దేవతలకు పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

చౌడేపల్లె, మే 2 (ఆంధ్రజ్యోతి): సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండ సమీపంలో అక్క దేవతలకు శుక్రవారం పచ్చ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మండలంలోని కొత్తగూబలవారిపల్లె, మల్లెలవారిపల్లె, దాశరయ్యగారిపల్లె గ్రామస్తులు అక్క దేవతలకు పచ్చ వేసి ప్రత్యేకంగా పూజలు చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

రైతులు వ్యవసాయ సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

కల్లూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): రైతులు స్మార్ట్ ఫోన్ల ద్వారా వ్యవసాయ సాంకేతికతను అందిపుచ్చుకోవాలని మండల వ్యవసాయాధికారి హరిప్రసాద్ తెలిపారు. పులిచెర్ల మండలం ఎర్రపాపిరెడ్డిగారిపల్లి రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం రైతులకు వ్యవసాయ రంగంలో స్మార్ట్‌ఫోన్ల వినియోగంపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించుకునేందుకు స్మార్ట్‌ఫోన్లు ఉపయోగపడుతాయన్నారు. వ్యవసాయ సమాచారం, ఉత్పాదకతను పెంచడం, సమర్థవంతమైన నిర్వహణ సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహుడి సన్నిధిలో ఆదిశంకరాచార్యుల జయంతి

కల్లూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవళంపేట లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాన్ని భక్తులు పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అనంతకుమారాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

బస్సు ఢీకొని వృద్ధుడి మృతి

బంగారుపాళ్యం, మే 2 (ఆంధ్రజ్యోతి): బస్సు ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఎస్‌ఐ ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. జిల్లేడుపల్లె పంచాయతీ జె.కొత్తూరుకు చెందిన చెంగల్‌రెడ్డి(79) నలగాంపల్లెలోని వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకోవడానికి శుక్రవారం చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి దాటుతున్నాడు. ఆ సమయంలో చిత్తూరు నుంచి పలమనేరు వైపు వెళుతున్న ఓ ప్రైవేటు బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఆయన్ను చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

6న గంగజాతర చాటింపు

చిత్తూరు కల్చరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈనెల 13, 14 తేదీల్లో నిర్వహించనున్న నడివీధి గంగజాతరకు ఆరో తేదీన చాటింపు వేయనున్నారు. ఈ సందర్భంగా చెంగ్రాయకొండలోని నాగాలమ్మ ఆలయంలో ఉత్సవ వంశపారంపర్య ధర్మకర్తలు సీకే బాబు కుటుంబీకులు గెరిగ పూజలు చేస్తారు. తర్వాత గంగినేని చెరువు శక్తి మారియమ్మ ఆలయం నుంచి ప్రదర్శనగా పొన్నియమ్మ ఆలయానికి గెరిగను తీసుకొచ్చి అధికారికంగా గంగజాతరను ఆరంభిస్తారు.

ఏవోగా అంజయ్య

చిత్తూరు సెంట్రల్, మే 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యవసాయశాఖలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న అంజయ్యకు పరిపాలన అధికారిగా (ఏవోగా) పదోన్నతి లభించింది. ఈ మేరకు ఆయన శుక్రవారం ఆ శాఖ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.

ఓటర్ల వివరాల నవీకరణ

చిత్తూరు కలెక్టరేట్, మే 2 (ఆంధ్రజ్యోతి): భారత ఎన్నికల సంఘం మూడు కొత్త కార్యక్రమాలు చేపట్టింది. ఓటర్ల జాబితా కచ్చితత్వాన్ని మెరుగుపరచడం, ఓటు వేసే ప్రక్రియను మరింత సులభతరం చేయాలనే లక్ష్యంతో వీటికి నాంది పలికినట్లు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ తెలిపారు. జనన, మరణాల జాబితా ఆధారంగా మరణించిన ఓటర్ల వివరాలను అప్‌డేట్ చేస్తారు.

ఆధ్యాత్మికం

శాస్త్రోక్తంగా మృత్యుంజయేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకొస్తున్న పుట్టమట్టి



అలంకరణలో మృత్యుంజయేశ్వరస్వామి దంపతులు

చౌడేపల్లె, మే 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో మొదటి రోజు శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. శుక్రవారం ఉదయం స్వామివారికి ఆలయ ప్రధానార్చకులు డాక్టర్ రాజశేఖర్ దీక్షితులు, కుమార స్వామి, మహేష్ దీక్షితులు స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం మంగళ వాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా పుట్టమట్టిని తీసుకుని పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం స్వామివారి యాగశాలలో నవధాన్యాలను కొత్త కుండలలో మొలక పోసి స్వామివారి బ్రహోత్సవాలకు అంకురార్పణ చేశారు.

నవధాన్యాల అలంకరణలో విరూపాక్షి మారెమ్మ



పుంగనూరు రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం నవధాన్యాల అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ అర్చకులు ఉదయాన్నే ఆలయాన్ని శుద్ధి చేసి మామిడి, వేప ఆకులతో తోరణాలు కట్టి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేపట్టారు. మహిళలు ఉపవాసాలతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

బోయకొండలో రాహుకాల పూజలు



ప్రత్యేకాలంకరణలో బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రీతి కరమైన రాహుకాలంలో పసుపు, కుంకుమ, గంధం, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఆలయ ఈవో ఏకాంబరం భక్తుల అన్నదానం కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.


వైష్ణవిదేవికి పంచామృతాభిషేకాలు



వైష్ణవిదేవి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

చౌడేపల్లె, మే 2 (ఆంధ్రజ్యోతి): పుదిపట్లలో వెలసిన వైష్ణవిదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు వినోద్‌కుమార్‌రెడ్డి, శ్రావణి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మహాభారత వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం



అలంకరణలో ధర్మరాజులు

గుడుపల్లె, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యామిగానిపల్లెలోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల తిరునాళ్ల, మహాభారత వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం అంకురార్పణ, ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ధర్మరాజుల మూల విగ్రహానికి పూజారులు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. మధ్యాహ్నం మంగళ వాయిద్యాల నడుమ వేద పండితులు ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు చేశారు. ద్రౌపదీదేవి సమేత పాండవుల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

సోమల, మే 2 (ఆంధ్రజ్యోతి): సోమల పట్టణంలో కొలువుదీరిన స్వయంభేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ధ్వజా అవరోహణంతో ఉత్సవాలు ముగిశాయి. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ నాలుగు మాడ వీధుల్లో పూజలు చేశారు. అనంతరం ఉభయదారులు ఆలయ ధర్మకర్త బీవీ సోమశేఖర్‌ను సన్మానించారు.

6న గంగజాతర చాటింపు

చిత్తూరు కల్చరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈనెల 13, 14 తేదీల్లో నిర్వహించనున్న నడివీధి గంగజాతరకు ఆరో తేదీన చాటింపు వేయనున్నారు. ఈ సందర్భంగా చెంగల్రాయకొండలోని నాగాలమ్మ ఆలయంలో ఉత్సవ వంశపారంపర్య ధర్మకర్తలు సీకే బాబు కుటుంబీకులు గెరిగ పూజలు చేస్తారు. తర్వాత గంగినేని చెరువు శక్తి మారియమ్మ ఆలయం నుంచి ప్రదర్శనగా పొన్నియమ్మ ఆలయానికి గెరిగను తీసుకొచ్చి అధికారికంగా గంగజాతరను ఆరంభిస్తారు.

ఈ నీటి వృథాను అరికట్టలేరా?



యాదమరిలో రోడ్డుపై వృథాగా పారుతున్న నీరు

యాదమరి, మే 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చిత్తూరు - గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారి రోడ్డులోని యూనియన్ బ్యాంకు వద్ద గ్రామ పంచాయతీకి చెందిన మంచినీటి సరఫరా వ్యవస్థ దెబ్బతిన్నంది. దీంతో శుక్రవారం తాగునీరు రోడ్డుపై ప్రవహించింది. వేసవిలో నీటి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అలరించిన 'ఉత్తర గోగ్రహణం'



ఉత్తర గోగ్రహణం దృశ్యాలు

వెదురుకుప్పం, మే 2 (ఆంధ్రజ్యోతి): చవటగుంట మహాభారత ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పాలకుంటచేను గ్రామానికి చెందిన చంద్రమ్మ, సుబ్రహ్మణ్యం రెడ్డి, మోహన్‌రెడ్డి, చెంగల్రాయరెడ్డి, నరసింహారెడ్డి ఉభయదారులుగా నిర్వహించిన ఉత్తర గోగ్రహణం అలరించింది. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి పర్యవేక్షించారు. ● కార్వేటినగరం మండలం అమ్మపల్లె మహాభారత ఉత్సవాల్లోనూ ఉత్తర గోగ్రహణం కార్యకమాన్ని నిర్వహించారు.

రేపు ధర్మరాజుల ఆలయ మహాకుంభాభిషేకం



పిల్లారికుప్పంలో ముస్తాబైన ధర్మరాజుల ఆలయం

గుడిపాల, మే 2 (ఆంధ్రజ్యోతి): పిల్లారికుప్పం వద్ద నూతనంగా నిర్మించిన ద్రౌపది సమేత ధర్మరాజుల మునేశ్వరుల మహాకుంభాషేకం ఆదివారం నిర్వహించనున్నట్లు ధర్మకర్త మొగిలిరెడ్డి, కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం గణపతి, మహాలక్ష్మి, నవగ్రహ పూజలతో పాటు సుదర్శన హోమం తదితరాలు నిర్వహించారు.

స్కిల్ యాప్‌లపై అవగాహన పెంచుకోండి

● రైతులకు వ్యవసాయాధికారి సూచన

పెనుమూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): స్కిల్ యాప్‌లపై అవగాహన పెంచుకోవాలని రైతులకు వ్యవసాయ అధికారి శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం చింతపెంట సచివాలయంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయానికి ఉపయోగపడే అగ్రి సెంట్రల్, వ్యవపాయం, ప్లాంటిక్స్, ఎస్‌పీఎస్‌ఎస్ అనే యాప్‌ల వినియోగాన్ని తెలియజేశారు. దీనివల్ల ధాన్యం రేట్లు, పంటలకు ఏ సమయంలో ఏ మందులు వాడాలన్న సమాచారం తెలుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఏఏ డిల్లీబాబు, అములు పాల్గొన్నారు.

చిన్నారులకు చిత్రలేఖన పోటీలు



చిత్తూరు కల్చరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా చిన్నారులకు ఆధ్యాత్మిక, సాంస్కృతిక అంశాలపై ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. గిరింపేట సత్యసాయి సంస్థాన్, కొంగారెడ్డిపల్లె ఉషానగర్ కాలనీ బాలవికాస్, సంతపేట గాండ్లవీధి బాలవికాస్ కేంద్రాల్లో శుక్రవారం చిన్నారులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. విజేతలకు ఆరో తేదీన బహుమతులు అందించనున్నట్లు సత్యసాయి సమితి నిర్వాహకులు తెలిపారు.

ఓటర్ల వివరాల నవీకరణ

చిత్తూరు కలెక్టరేట్, మే 2 (ఆంధ్రజ్యోతి): భారత ఎన్నికల సంఘం మూడు కొత్త కార్యక్రమాలు చేపట్టింది. ఓటర్ల జాబితా కచ్చితత్వాన్ని మెరుగుపరచడం, ఓటు వేసే ప్రక్రియను మరింత సులభతరం చేయాలనే లక్ష్యంతో వీటికి నాంది పలికినట్లు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ తెలిపారు. జనన, మరణాల జాబితా ఆధారంగా మరణించిన ఓటర్ల వివరాలను అప్‌డేట్ చేస్తారు. కొత్త నమూనాతో ఓటరు సమాచార చీటీని అందిస్తారు.

'ఉపాధి' కూలీలపై తేనెటీగల దాడి



బాధితులను పరామర్శిస్తున్న ఎంపీడీవో రాఘవేంద్రరావు తదితరులు

తవణంపల్లె, మే 2 (ఆంధ్రజ్యోతి): టి.పుత్తూరు పంచాయతీ పరిధిలో గ్రామానికి చెందిన 40 మంది 'ఉపాధి' కూలీలు శుక్రవారం పనులు చేస్తుండగా తేనెటీగలు దాడి చేసి, కుట్టాయి. దీంతో వీరిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతున్న కూలీలను ఎంపీడీవో రాఘవేంద్రరావు, ఏవో రెడ్డిబాబులు పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు.

సాంకేతికతపై రైతులకు అవగాహన

వెదురుకుప్పం, మే 2 (ఆంధ్రజ్యోతి): ఆధునిక వ్యవసాయ సాంకేతికతపై రైతులకు శుక్రవారం కార్వేటినగరం మండలం ఆలత్తూరు, అమ్మపల్లె రైతు సేవా కేంద్రాల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ వై.మధుసూదనరెడ్డి, వ్యవసాయాధికారి ఆర్.హేమలత, వ్యవసాయ విస్తరణ అధికారి కె.గాయత్రి, ఎం.మునికృష్ణ, ఆర్.కల్పన, వై.కుసుమ పాల్గొన్నారు.

యాదమరి: మండలంలోని 12 కమ్మపల్లె, జంగాలపల్లె రైతుసేవా కేంద్రాల్లో జరిగిన కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి చరిత, శిక్షకులు సాయిసింహారెడ్డి, అనిత, భవాని, ఢిల్లీప్రసాద్, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏవోగా అంజయ్య బాధ్యతల స్వీకరణ

చిత్తూరు సెంట్రల్, మే 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యవసాయశాఖలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న అంజయ్యకు పరిపాలన అధికారిగా (ఏవోగా) పదోన్నతి లభించింది. ఈ మేరకు ఆయన శుక్రవారం ఆ శాఖ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.

రేపు భగీరథ మహర్షి జయంతి

చిత్తూరు అర్బన్, మే 2 (ఆంధ్రజ్యోతి): భగీరథ మహర్షి జయంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ఈకార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని పాత గ్రీవెన్స్ హాలులో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

చెరువులో పుష్కలంగా నీరు

అయినా ఎండుతున్న పంటలు

తూము నుంచి నీరు వెలుపలకు రాకపోవడమే కారణమంటున్న రైతులు



తూము వద్ద మరమ్మతుకు గురైన ఇనుప గేటు

విజయపురం, మే 2 (ఆంధ్రజ్యోతి): కోసలనగరం చెరువు నిండు కుండలా ఉన్నా.. పొలాలకు సాగునీరు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువు తూములో నీరు వెలుపలకు వదలడానికి ఏర్పాటు చేసిన ఇనుప గేటు మరమ్మతులకు గురవడమే దీనికి కారణమని చెబుతున్నారు. చెరువులో నీరుండి కూడా పంటలు ఎండుతున్నాయని వాపోయారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ దృష్టికి మాజీ జడ్పీటీసీ వసంత సుధాకర్‌రాజు తీసుకెళ్లారు. దాంతో ఆయన ఇరిగేషన్ ఈఈ మురళీతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని కోరారు. రెండ్రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని ఈఈ చెప్పారు.



నిండు కుండలా ఉన్న కోసలనగరం చెరువు

కాణిపాకంలో ఆదిశంకరాచార్యుల జయంతి వేడుకలు



కాణిపాకంలో ఆదిశంకరాచార్యుల చిత్ర పటానికి హారతి - తేనెబండ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో పూజలు

ఐరాల(కాణిపాకం), మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఆలయ అలంకార మండపం వద్ద ఉన్న కల్యాణ వేదికపై ఆదిశంకరాచార్యుల చిత్ర పటం ఉంచి విశేష పూజలను చేశారు. ఈవో పెంచలకిషోర్, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెడెంట్లు వాసు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు బాలాజీనాయుడు, రవి తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు కల్చరల్: నగరంలోని తేనెబండ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో నగర విశ్వబ్రాహ్మణ సంఘ ప్రతినిధులు మల్లిఆచారి, కృష్ణం ఆచారి, వినాయకంఆచారి పాల్గొన్నారు.

యాదమరి: మండలకేంద్రంలోని ఏకాంబరేశ్వర కామాక్షి అమ్మవార్ల ఆలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు కాసలనాటి చంద్రశేఖర్ శాస్త్రి, బ్రాహ్మణ సంఘం నాయకులు లక్ష్మీనారాయణ, కాసలనాటి సత్యనారాయణ శాస్త్రి, శ్రీధర్ శర్మ, షణ్ముఖ శర్మ, రవి శర్మ, కళ్యాణమ్మ తదితరులు పాల్గొన్నారు.

నగరి: కీళపట్టులోని త్రిపుర సుందరీ సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వెదురుకుప్పం: కార్వేటినగరంలోని కంచి కామాక్షమ్మ దేవాలయంలో శంకరాచార్య చిత్ర పటాన్ని ఊరేగించారు. రావూరి శ్రీనివాసులు, రావూరి రవికుమార్, భక్తులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం: సీడీపీవో

యాదమరి, మే 2 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికడదామని సిబ్బందికి సీడీపీవో వాణి శ్రీదేవి అవగాహన కల్పించారు. జంగాలపల్లె, కీనాటంపల్లి గ్రామాల్లో శుక్రవారం కిశోరి వికాసంపై సిబ్బందికి శిక్షణ తరగతులను నిర్వహించారు. అంగన్వాడీ సూపర్‌వైజర్ లలితకుమారి, సీహెచ్‌వో లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు అర్బన్: జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కిశోరి వికాసం పోస్టర్లను శుక్రవారం వినాయకపురం పాఠశాల వద్ద ఆవిష్కరించారు. సీడీపీవో శ్యామ సుగుణ, కార్పొరేటర్ ప్రభావతి, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే 40వ డివిజన్‌లో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ గణేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు దాచూరి: యూటీఎఫ్

ఐరాల, మే 2 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ వ్యవస్థాపకుడు దాచూరిరామిరెడ్డి ఆదర్శనీయుడని జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్‌నాయుడు అన్నారు. శుక్రవారం ప్రాథమిక పాఠశాల ఆవరణలో దాచూరి వర్ధంతిని నిర్వహించారు. నాయకులు కృష్ణారెడ్డి, జగన్నాథనాయుడు, అరుణ్‌కుమార్, ప్రభాకర్, జనార్ధన్, అమ్ములు, రాధిక తదితరులు పాల్గొన్నారు.

'రంగునీటి యూనిట్ల' మూసివేతకై కరపత్రాల పంపిణీ



నగరి, మే 2 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలోని కలుషిత రంగు నీటి యూనిట్ల మూసివేతకై నగరి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం పట్టణంలో కరపత్రాలను పంపిణీ చేశారు. అలాగే జనం నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో రమేష్‌నాయుడు, కృపాకర్, తిరుమల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

పలమనేరు, మే 2 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ హబ్‌తో నిరుద్యోగ యువతీ యువకులకు డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, ఆఫీస్ అసిస్టెంట్ ఉద్యోగాలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశులు తెలిపారు. శిక్షణ తీసుకున్న అభ్యర్థులకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్, నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ల ద్వారా సర్టిఫికెట్లు అందించనున్నట్లు పేర్కొన్నారు. పలమనేరు నియోజకవర్గంలోని పదో తరగతి చదివిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశులు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు రిజిస్ట్రేషన్ కోసం ఫోన్‌నంబరు 8465830771 ను సంప్రదించాలన్నారు. రిజిస్ట్రేషన్ కోసం అభ్యర్థుల ఆధార్, మార్కులిస్టుల జిరాక్సులు, పాస్‌పోర్టు సైజు ఫొటోలను తీసుకురావాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



చిరంజీవి (ఫైల్ ఫొటో)

కుప్పం, మే 2 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో శుక్రవారం చిరంజీవి (19) అనే యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. గుడుపల్లె మండలం కంచిబందార్లపల్లె గ్రామానికి చెందిన వెంకటేష్, లక్ష్మీ దంపతుల కుమారుడు చిరంజీవి కుప్పం పట్టణానికి చెందిన వేద పండితుడు బాబుస్వామి వద్ద రెండేళ్లుగా డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతను కుప్పంలోనే చిత్తరంజన్ రోడ్డులోని ఓ గదిలో ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం బాబుస్వామికి, ఇతరులకు టిఫిన్ తెచ్చి ఇచ్చి రూమ్‌కు వెళ్లాడు. సాయంత్రం అయినా చిరంజీవి తిరిగి రాకపోవడంతో బాబుస్వామి అతడికి ఫోన్ చేశాడు. అటు నుంచి స్పందన లేకపోవడంతో అనుమానం వచ్చి కొందరు రూముకు వెళ్లి చూశారు. గదిలో ఫ్యానుకు పంచెతో ఉరి వేసుకున్న రీతిలో కనిపించిన చిరంజీవి మృతదేహం కనిపించింది. దీంతో పోలీసులకు ఫోన్ చేయగా పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కుప్పం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ప్రేమ వ్యవహారంలో విఫలమైనందు వల్లే చిరంజీవి ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు అనుమానిస్తున్నారు. కుప్పం అర్బన్ ఎస్సై బాబును వివరణ కోరగా కుటుంబ సమస్యల వల్లే ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు.

నగరిలో తాగునీటి సమస్య తలెత్తకూడదు: ఎమ్మెల్యే



మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, మే 2 (ఆంధ్రజ్యోతి): నగరిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆదేశించారు. తిరుపతిలోని తన స్వగృహంలో శుక్రవారం ఉదయం మున్సిపల్ అధికారులతో సమావేశమయ్యారు. తాగునీటి విషయంలో నిర్లక్ష్యం వహిస్తే క్షమించేది లేదని హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సీహెచ్‌వోలకు ఎఫ్‌ఆర్‌ఎస్‌ల నుంచి మినహాయింపు ఇవ్వండి: ఏఐటీయూసీ



కలెక్టరేట్ వద్ద నినాదాలు చేస్తున్న సీహెచ్‌వోలు

చిత్తూరు అర్బన్, మే 2 (ఆంధ్రజ్యోతి): సీహెచ్‌వోలకు ఎఫ్‌ఆర్‌ఎస్‌ల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, జిల్లా గౌరవాధ్యక్షుడు నాగరాజన్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ వద్ద సీహెచ్‌వోలు ఐదు రోజులుగా చేస్తున్న సమ్మెకు ఏఐటీయూసీ నేతలు మద్దతు పలికారు. వారు మాట్లాడుతూ.. సీహెచ్‌వోలు ఆరేళ్లుగా పనిచేస్తున్నప్పటికీ ఇంతవరకు వారిని పర్మినెంట్ చేయలేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా సీహెచ్‌వోల సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే జిల్లా వ్యాప్తంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని హెచ్చరించారు.

బస్సు ఢీకొని వృద్ధుడి మృతి



చెంగల్‌రెడ్డి మృతదేహం

బంగారుపాళ్యం, మే 2 (ఆంధ్రజ్యోతి): బస్సు ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఎస్‌ఐ ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. జిల్లేడుపల్లె పంచాయతీ జె.కొత్తూరుకు చెందిన చెంగల్‌రెడ్డి(79) నలగాంపల్లెలోని వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకోవడానికి శుక్రవారం చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి దాటుతున్నాడు. ఆ సమయంలో చిత్తూరు నుంచి పలమనేరు వైపు వెళుతున్న ఓ ప్రైవేటు బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఆయన్ను చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

11న మాలల ఆత్మీయ గౌరవ సభ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అశోక్‌కుమార్

పుంగనూరు రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఈనెల 11న తిరుపతిలో జరిగే మాలల ఆత్మీయ గౌరవసభను జయప్రదం చేయాలని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక మాలమహానాడు కార్యాలయంలో మాలల ఆత్మీయ గౌరవసభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభకు మాల కులస్తులైన మేధావులు, విద్యార్థులు, మాల సంఘ నాయకులు, ఉద్యోగ సంఘ నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు రాయలసీమ మాల సభ కన్వీనర్ మల్లారపు మధు, వెంకటస్వామి, సదుం రవికుమార్, శ్రీనివాసులు, కృష్ణమూర్తి, బ్యాంక్ రెడ్డెప్ప, కూరపర్తి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. కల్యాణోత్సవం



స్వామి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ చేస్తున్న అర్చకుడు గంగాధర గురుకుల్ - భక్తులకు మంగళసూత్రం చూపుతున్న అర్చకుడు

బంగారుపాళ్యం, మే 2 (ఆంధ్రజ్యోతి): మొగిలిలోని కామాక్షి సమేత మొగిలీశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా దేవరకొండపై ఉన్న పార్వతీ సమేత జలకంఠేశ్వస్వామి కల్యాణోత్సవం శుక్రవారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. మొగిలీశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు గంగాధర గురుకుల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పలు గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఉదయం ఆలయంలో పూజలు, హోమాలు జరిగాయి. అనంతరం విఘ్నేశ్వరుడు, పార్వతీదేవి సమేత జలకంఠేశ్వరస్వామితో పాటు నందీశ్వరుడి విగ్రహాలను నూతనంగా ప్రతిష్ఠించి, ప్రాణప్రతిష్ఠ చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేయగా, ఉభయదారులుగా టీడీపీ మండల అధ్యక్షుడు ఎస్పీ జయప్రకాష్ కుటుంబీకులు వ్యవహరించారు. మండల క్లస్టర్ ఇన్‌చార్జి ధరణీప్రసాద్‌నాయుడు, మాజీ జడ్పీటీసీ సుభాష్‌నాయుడు,జనార్ధనగౌడ్,హరిప్రసాద్, రమేష్, మంజునాథ్, ధనంజయనాయుడు, అర్చకులు హరీష్ గురుకుల్, మనోజ్ గురుకుల్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

నేడు కృష్ణమూర్తి స్వామి ఆలయ కుంభాభిషేకం

పాలసముద్రం, మే 2 (ఆంధ్రజ్యోతి): శ్రీకావేరిరాజుపురంలో నిర్మించిన రాధా రుక్మిణి సమేత కృష్ణమూర్తి స్వామి ఆలయ కుంభాభిషేకం శనివారం జరగనుందని గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే థామస్ పాల్గొంటారని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆరాధన



చిత్తూరు కల్చరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): కోదండరామాలయంలో రామానుజాచార్యుల ఆరాధనను నగరంలోని వైష్ణవ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈవో సుబ్రహ్మణ్యం నాయుడు, అర్చకుడు వేణుగోపాల్, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

బాలికలకు కౌమార దశ కీలకం

పెనుమూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): బాలికలకు కౌమారదశ కీలకమని ట్రైనర్ అఫ్రీన్ అన్నారు. శుక్రవారం రామకృష్ణాపురం సచివాలయంలో కిశోరి వికాసంపై కార్యక్రమం జరిగింది. బాలికలు, అంగన్వాడీ కార్యకర్తలు, వెలుగు సభ్యులు, ఆశా వర్కర్లు, సెక్రటరీ సునీత, సర్పంచ్ వెంకటేశ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నింద్ర: కిశోర బాలికల భద్రతపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో శివప్రసాద్ వర్మ అన్నారు. శుక్రవారం నింద్రలో కిశోర బాలికల భద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీవో వెంకటేశులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

బృందావనంలో తనిఖీలు

పాలసముద్రం, మే 2 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం బృందావనాన్ని శుక్రవారం ఇన్‌చార్జి ఎంపీడీవో విద్యావతి తనిఖీ చేశారు. చెత్త నుంచి ఎరువులను తయారు చేసి రైతులకు తక్కువ ధరకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అయ్యప్పన్, ఈవోపీఆర్డీ రమేష్, పంచాయతీ కార్యదర్శి మణికంఠ పాల్గొన్నారు.

మండీల కోసం దరఖాస్తు చేసుకోండి

సోమల, మే 2 (ఆంధ్రజ్యోతి): సోమల మార్కెట్ యార్డులో నూతనంగా నిర్మించిన అద్దె గదులలో వ్యాపార లావాదేవీలకు దరఖాస్తులు చేసుకోవాలని ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు తెలిపారు. మార్కెట్ యార్డులో టమోటా, మామిడి, చింతకాయలకు ప్రత్యేకంగా గదులు కేటాయించామని.. ఆసక్తి ఉన్న వ్యాపారులు ఏఎంసీ కార్యాలయంలోని కార్యదర్శిని కలిసి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

బోయకొండలో రాహుకాల పూజలు



ప్రత్యేకాలంకరణలో బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రీతికరమైన రాహుకాలంలో పసుపు, కుంకుమ, గంధం, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఆలయ ఈవో ఏకాంబరం భక్తుల అన్నదానం కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

పుంగనూరు మున్సిపల్ మేనేజర్‌గా రెడ్డీశ్వరి



పుంగనూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మున్సిపల్ మేనేజర్‌గా రెడ్డీశ్వరి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పుంగనూరులో మున్సిపల్ మేనేజర్‌గా పని చేస్తున్న విజయభారతి హిందూపురం మున్సిపాలిటీకి బదిలీ కావడంతో మదనపల్లె మున్సిపాలిటీలో పని చేస్తున్న రెడ్డీశ్వరి పదోన్నతిపై పుంగనూరుకు వచ్చారు.